క్లుప్తంగా

అధైర్య పడకండి.. అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్



ప్రత్తిపాడు: అధైర్య పడవద్దని, అండగా నిలుస్తామని పిడుగుపాటుతో మృతి చెందిన కూలీల కుటుంబ సభ్యులకు బలసాని భరోసా ఇచ్చారు. పెదనందిపాడు మండలం అన్నపర్రు గ్రామానికి చెందిన తన్నీరు నాగేంద్రం, దేవరపల్లి సామ్రాజ్యంలు రెండు రోజుల కిందట వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో పిడుగు పాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం మృతుల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ పరామర్శించి, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. పిడుగుపాటుకు అకాల మరణం చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, ఆర్థిక సాయం ప్రకటించాలని కోరారు. వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

తహసీల్దార్ జియావుల్ హక్



పొన్నూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల నుంచి తీసుకుంటున్న ఫిర్యాదులు, సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి ఏడు అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ 4, సర్వే 1, మండల పరిషత్‌కు 2 అర్జీలు అందాయని, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ సమస్యలతో ఎంతో దూరం నుంచి వచ్చే ప్రజలను ఇబ్బందులకు గురి చేయకుండా పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సర్వే వేగవంతం చేయాలి

తహసీల్దార్ జియావుల్ హక్



పొన్నూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న చిన్న తరహా నీటి వనరుల గణన సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సర్వేపై వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో చేపడుతున్న సర్వేను నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. సేకరించిన సమాచారాన్ని తక్షణమే ఎంఐ సెన్సెస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న బోర్లు, బావులు, చెరువులు వాటికి సంబంధించి సర్వే నంబర్లను ఫొటోతో సహా నమోదు చేయాలన్నారు. ఈ సర్వే ద్వారా కేంద్రం నుంచి నిధులు వచ్చే అవకాశం ఉందని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే ఉద్దేశంతో సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఆలేటి మాధవి, సహాయ గణాంకాధికారి నల్లాని ప్రసాదు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ



పెదకాకాని: ది వెనిగండ్ల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీని ప్రారంభించినట్లు సొసైటీ అధ్యక్షుడు పులగం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. 2024–25 సంవత్సరానికి పాల ఉత్పత్తిదారులకు చెల్లించిన బట్వాడాపై 9 శాతం బోనస్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పాల ఉత్పత్తిదారులకు 9 శాతం బోనస్ రూ.2,73,392, ధరల వ్యత్యాసం రూ.11,65,253 కలిపి మొత్తం రూ.14,38,645 పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ బ్రాంచ్ మేనేజర్ టి.ఆనందరావు, సూపర్‌వైజర్ సీహెచ్ శివరామకృష్ణ, సెక్రటరీ కె.సుబ్బారెడ్డి, పాలకవర్గం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ ఏడాది అత్యధిక బోనస్ కోడూరి లక్ష్మి రూ.2,92,116, కొండమడుగుల రామ్మోహన్‌రెడ్డి రూ.1,36,781 పొందారన్నారు. అత్యధిక బోనస్ పొందిన పాడి రైతులను పాలకవర్గం సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు.

• దుర్గంధం.. భరించలేకపోతున్నాం..!



రోడ్డు వెంబడి పారబోసిన వ్యర్థాలు

పొన్నూరు: మండలంలోని వెల్లలూరు గ్రామ ప్రధాన రహదారి వెంబడి చెత్తలు, వ్యర్థాల నిల్వలు పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. గుంటూరు నుంచి పొన్నూరు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. రోడ్డు వెంబడి పాడైపోయిన ఉల్లిగడ్డలు, వ్యర్థాలను పారబోయడంతో వెరసి వాటి నుంచి వచ్చే దుర్వాసనని భరించలేకపోతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. రోడ్డు పక్కన అనేకచోట్ల వ్యర్థాలు పేరుకుపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

• పొంగి ప్రవహిస్తున్న డ్రెయిన్లు



చేబ్రోలు మండలం శలపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న డ్రెయిన్

చేబ్రోలు: రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి కాలువలు, డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. చేబ్రోలు మండలం శలపాడు గ్రామం వద్ద సోమవారం కోడు కట్ట డ్రెయిన్ వద్ద వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. కోడు వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తున్నది. సమీప పొలాల్లోకి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు ప్రవహించటంతో వరి పొలాలు ముంపు బారిన పడ్డాయి. రెండు రోజులు అయినా ఉధృతి తగ్గకపోవటంతో పొలాలు నీట మునిగిపోయాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికి మూడోసారి పొలాలు ముంపు బారిన పడటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట మునిగి దెబ్బతిని నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఫార్మసీ కళాశాలకు ప్రొఫెసర్ల నియామకం

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాలకు ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు ఆదేశాలతో ఇద్దరు ప్రొఫెసర్లను నియమిస్తూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణా జిల్లాకు చెందిన డాక్టర్ జ్యోతిర్మయి దేవినేని, ప్రకాశం జిల్లాకు చెందిన డాక్టర్ కరవడి తేజోమూర్తిలను ప్రొఫెసర్‌లుగా నియమించారు. ఈ నెల 4వ తేదీన నియామక ఉత్తర్వులు జారీ చేయగా ఈ నెల 19వ తేదీలోగా విధుల్లో చేరాల్సి ఉంది. అయితే వీరు సోమవారం విధుల్లో చేరారు. వీరికి నెలకు రూ.1,30,000 వేతనంగా నిర్ణయించారు. వీరు ఏడాది పాటు ప్రొఫెసర్లుగా కొనసాగనున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడులో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. నల్లపాడు సీఐ వంశీధర్ వివరాల మేరకు నల్లపాడు రోడ్డులోని శ్రీనివాసకాలనీ వినాయకుని గుడి సమీపంలో గుర్తు తెలియని వాహనం గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొంది. వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆచూకీ తెలిసిన వారు 8688831590, 8688831376 నంబర్లకు తెలపాలన్నారు.

సీఆర్పీలు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

ఎంపీడీవో శివపార్వతి



మాట్లాడుతున్న ఎంపీడీవో కె.శివపార్వతి

ప్రత్తిపాడు: సీఆర్పీలు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఎంపీడీవో కె.శివపార్వతి అన్నారు. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం పంచాయతీలోని సుప్రీమ్ ఎల్‌టీసీలో కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ (సీఆర్పీ)లకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా తొలిరోజు ప్రత్తిపాడు, కాకుమాను, గుంటూరురూరల్, ఫిరంగిపురం, తాడికొండ మండలాల్లో ఎంపికయిన సీఆర్పీలకు చెత్త వ్యర్థాలను వేరు చేసే విధానంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ చల్లా నాగమల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రత్తిపాడు ఎంపీడీవో కె.శివపార్వతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు శానిటేషన్ ప్రక్రియ, చెత్త వ్యర్థాలను వేరు చేయు విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించేందుకే సీఆర్పీలను ప్రభుత్వం నియమించిందని చెప్పారు. జిల్లా పంచాయతీ రిసోర్స్ కో ఆర్డినేటర్ అనూరాధ మాట్లాడుతూ ప్రతి రోజూ కనీసం 2–3 గంటలు ఇంటింటికీ తిరిగి డ్వాక్రా మహిళలు, ప్రజలకు వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించాలన్నారు. తొలుత ఎస్‌డబ్ల్యూపీసీ ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి అధికారులు పూలమాలలువేసి నివాళులర్పించారు. స్వచ్ఛ భారత్‌మిషన్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ డబ్బూరి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా, ఐటీసీ, ఫినిష్ సొసైటీ కో ఆర్డినేటర్ ఉమామహేశ్వరి, సీఆర్పీలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దారు శ్రీనివాసశర్మకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

చేబ్రోలు: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళన కార్యక్రమాల ముందస్తు సమాచారం మేరకు మండలాధికారులకు సోమవారం చేబ్రోలు మండలం గ్రామ సచివాలయ ఉద్యోగుల వినతిపత్రం అందజేశారు. సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి చేసే సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కలిగించాలని, మాతృ శాఖలకు అప్పగించాలని, ఒత్తిడి విధుల నుంచి విముక్తి కలిగించాలని కోరారు. సచివాలయ ఉద్యోగుల ప్రధాన సమస్యలు నోషనల్ ఇంక్రిమెంట్లు, ఆరు సంవత్సరాలు ఒకే క్యాడర్‌లో పనిచేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్లు, ప్రమోషన్స్, సీనియారిటీ లిస్ట్ విడుదల చేయాలని, పారదర్శక బదిలీలు జరిగేలా విధి విధానాలను ఖరారు చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. 15 రోజులలోగా సమస్యలకు పరిష్కారం చూపాలని లేని పక్షంలో ఉద్యోగుల ఐక్యవేదిక తరపున రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ అతిథి అధ్యాపకునికి గౌరవ డాక్టరేట్



కృష్ణమోహన్‌కు గౌరవ డాక్టరేట్ అందజేస్తున్న భారత్ వర్చువల్ విశ్వవిద్యాలయం చైర్మన్ స్వామి, సైకాలజిస్ట్ డాక్టర్ యమునా

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సైకాలజీ విభాగంలో అతిథి అధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్న కొక్కిరగడ్డ కృష్ణమోహన్ గౌరవ డాక్టరేట్ పొందారు. సైకాలజీ రంగంలో చేసిన కృషికి కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని భారత్ వర్చువల్ విశ్వవిద్యాలయం ఈ నెల 13న బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో కృష్ణమోహన్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. విశ్వవిద్యాలయ చైర్మన్ టీఎం స్వామి, అంతర్జాతీయ సైకాలజిస్ట్ డాక్టర్ యమునా పాఠక్, డాక్టర్ శ్రీనివాసమూర్తి (డీఎస్పీ), ప్రొఫెసర్ సునంద, యల్లా కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు. కృష్ణమోహన్ మానసిక ఆరోగ్యం, సంక్షేమం, మహిళా శక్తి, ఆత్మహత్యల నివారణ, యువ నైపుణ్య అభివృద్ధి వంటి అంశాలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 10 ఏళ్లకు పైగా అధ్యాపకునిగా అనుభవం కలిగిన కృష్ణమోహన్ బోధనలో అనేక సృజనాత్మక పద్ధతులను అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ఆచార్య జి.చెన్నారెడ్డి, అధ్యాపకులు టీడీ విమల, ప్రమీలరాణి, అనుపమ, సహచర అతిథి అధ్యాపకులు కృష్ణమోహన్‌కు అభినందనలు తెలిపారు.

విజ్ఞాన్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



మాట్లాడుతున్న లెఫ్టినెంట్ కల్నల్ దీపక్ కుమార్ శర్మ

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో సోమవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. గుంటూరులోని 25 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ దీపక్ కుమార్ శర్మ మాట్లాడుతూ ఎన్‌సీసీ వలన విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలన, సానుకూల దృక్పథం అలవడతాయని అన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ సీనియర్‌లు జూనియర్ విద్యార్థులకు యూనివర్సిటీ విధివిధానాలు, కల్చర్ గురించి అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునే దిశగా సాగాలని సూచించారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా మొదటి సంవత్సరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వీసీ పి.నాగభూషణ్, సీఈవో మేఘన కూరపాటి తదితరులు పాల్గొన్నారు.

తురకపాలెం మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న విదసం నాయకులు, తురకపాలెం గ్రామస్తులు

గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామంలో అంతుపట్టని వ్యాధితో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని, ఈ మిస్టరీ మరణాలపై శవ పరీక్షలు చేసి హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తిచే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. విదసం ఐక్య ప్రతినిధులు తురకపాలెం గ్రామంలో మరణించిన వారి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టరును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద విదసం గుంటూరు దళిత సంఘాల ఆధ్వర్యంలో బాధితులు మృతుల ఫొటోలు పట్టుకుని తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ తురకపాలెం దళితవాడకు క్వారీ గుగ్గితో నిండిన గుంతల్లో కాలుష్య నీటిని సరఫరా చేశారని, ఆ నీటిలో వ్యాధికారక బ్యాక్టీరియా, యురేనియం అవశేషాలు ఉన్నట్టు నివేదికలు బయట పడ్డాయన్నారు.

ఈ నీటి కాలుష్యం వల్లే మూడు నెలల్లో 30 మందికి పైగా మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా ప్రభుత్వం వైఫల్యమని, మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గుంటూరు దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు నీలాంబరం, రవి మాట్లాడుతూ మరణించిన కుటుంబాలకు పిడికెడు అన్నం, చెంబుడు నీళ్లు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంటే సరికాదని తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మృతుల కుటుంబ సభ్యులు, విదసం నేతలు, తురకపాలెం గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధిలో ఇంజినీర్లది కీలక భూమిక

నీటిపారుదల శాఖ ఎస్‌ఈ మొహిద్దీన్



మాట్లాడుతున్న యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ ప్రాజెక్ట్స్ అసోసియేట్ డైరెక్టర్ నాడగౌడ



బహుమతి అందిస్తున్నయూఆర్ రావు శాటిలైట్ సెంటర్ ప్రాజెక్ట్స్ అసోసియేట్ డైరెక్టర్ నాడగౌడ



కిట్స్ కళాశాలలో ఎస్‌ఈ మొహిద్దీన్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రత్తిపాడు: దేశ అభివృద్ధిలో ఇంజినీర్లది కీలక భూమిక అని నీటి పారుదల శాఖ ఎస్‌ఈ ఎం.ఆర్.మొహిద్దీన్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్–కేఎస్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (కిట్స్)లో సోమవారం ఇంజినీర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ ఆధ్వర్యంలో స్థానిక సి.వి.రామన్ సెమినార్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ఎస్‌ఈ ఎం.ఆర్. మొహిద్దీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్‌ఈ మాట్లాడుతూ విద్యార్థులు వృత్తి పట్ల నిబద్ధత, గౌరవం కలిగి ఉండాలన్నారు. యువ ఇంజినీర్లు వినూత్నంగా ఆలోచించినప్పుడే విజయం సొంతమవుతుందన్నారు. కేవలం 20 సంవత్సరాల వయస్సుల్లోనే విశ్వేశ్వరయ్య గంగానదిపై వంతెనను నిర్మించడం ఆయన దార్శనికతను నిదర్శనమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా విశ్వేశ్వరయ్య సిద్ధాంతాలను, ఆలోచనా విధానాన్ని అనుసరించాలని కోరారు. ఇంజినీరింగ్ రంగంలో విశేష సేవలందిస్తున్న మొహిద్దీన్‌ను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో ఇంజినీరింగ్ నాల్గవ సంవత్సరం విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ఇంజినీర్స్ డే వేడుకలు

గుంటూరు రూరల్: ఇంజినీరింగ్ రంగం దేశ ఆర్థిక, సాంకేతిక ప్రగతికి వెన్నెముకని, మోక్షగుండం విశ్వేశ్వరయ్య కృషి నేటికీ యువతకు ఆదర్శనీయమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. సోమవారం భారతరత్న, ఇంజినీరింగ్ పితామహులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని చౌడవరంలోని కళాశాలలో ఇంజినీర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో, ఇంజినీరింగ్ విభాగాల విద్యార్థులు 114 రకాల నమూనాల ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. ప్రదర్శనలో ఆటోమేషన్, సైన్స్–టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్, స్వయం ఉపాధి, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, పునరుత్పాదక ఇంధన వనరులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐఓటీ వంటి అంశాలపై విద్యార్థులు చూపించిన సృజనాత్మక నమూనాల ఆవిష్కరణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో సాంకేతికతదే కీలకపాత్ర

గుంటూరు రూరల్: దేశాభివృద్ధిలో సాంకేతికతదే కీలకపాత్ర అని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఇంజినీర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కృషి పట్టుదలతో పనిచేసి సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. రిటైర్డ్ డీఈ వీవీ సుబ్బారావు మాట్లాడుతూ నీతి నిజాయితీతో ఇంజనీర్‌లు పని చేయాలని, దేశానికి యువ ఇంజనీర్‌ల అవసరం ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్, క్విజ్ తదితర పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఏ బాలాజీ, డాక్టర్ కేవీ రామారావు, డాక్టర్ వి.నాగగోపిరాజు, డాక్టర్ పి.నరేంద్రకుమార్, ఏ అరుణ, జె.భార్గవ్, డాక్టర్ తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరులలో ఇంజినీర్స్ డే వేడుకలు

గుంటూరు రూరల్: పలకలూరులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజినీర్స్ డే, బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థినుల స్వాగతోత్సవ వేడుకలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొడ్యూసర్ ట్రస్ట్ ప్రోగ్రాం డైరెక్టర్ మన్నవ శ్రీహర్ష పాల్గొన్నారు. ముందుగా కుమారి యశస్వి శుభగాత్రి స్వాగత నృత్యం, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజ్ఞాన్ విద్యా సంస్థల అధ్యక్షుడు డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని దేశం తొలి తరం ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేసే దిశగా కృషి చేయాలని కోరారు. ముఖ్య అతిథి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ చుట్టూ ఉన్న పరిస్థితులను గమనిస్తూ సాంకేతిక ఆవిష్కరణలు చేయాలని, నూతన సంస్థల స్థాపకులుగా వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జరిగిన మిస్ ఫ్రెషర్ 2025 పోటీలో మొదటి సంవత్సరం ఐటీ విద్యార్థిని కుమారి పూజిత విజేతగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వివిధ అంశాలలో ప్రతిభ చూపిన ఉపాధ్యాయులకు, బీటెక్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. అనంతరం అతిథులను సన్మానించారు.

విజ్ఞాన్ లో ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు

చేబ్రోలు: సుస్థిర అభివృద్ధి కోసం విద్యార్థులు కొత్త ఆవిష్కరణలతో ముందుకు రావాలని బెంగళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ ప్రాజెక్ట్స్ అసోసియేట్ డైరెక్టర్, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌వీ నాడగౌడ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో సోమవారం ప్రఖ్యాత ఇంజినీరు, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ఆర్‌వీ నాడగౌడ మాట్లాడుతూ ప్రపంచం వేగంగా మారిపోతోందని, ఈ మార్పుల మధ్య మన చుట్టూ ఏమి జరుగుతుందో గమనించడం ప్రతి విద్యార్థి బాధ్యతని అన్నారు. ప్రతి అవకాశాలను సద్వినియోగం చేసుకొని, అవసరమైన నైపుణ్యాలను సంపాదించాలన్నారు. ఇంజినీర్లు కేవలం సాంకేతిక పరిష్కారాలకే కాకుండా, సమాజ నిర్మాణానికి కూడా మూల స్తంభాలుగా నిలవాలన్నారు. హైదరాబాద్‌లోని స్కైరూట్ ఏరోస్పేస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీవీఎస్ కిరణ్ మాట్లాడుతూ దేశానికి ఉద్యోగాలను సృష్టించే ఇంజినీర్లు అవసరమన్నారు. ఇంజనీర్ల పాత్ర దేశ నిర్మాణంలో అపారమైందని అన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్, వైస్ చైర్మన్‌లు లావు రత్తయ్య శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, సీఈవో మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, డీన్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు



అతిథిని సన్మానించిన కళాశాల అధ్యాపకులు

డెయిలీ వేజ్ ఉద్యోగుల వేతనాలు పెంపు

పెదకాకాని(ఏఎన్‌యు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో డెయిలీ వేజ్ వర్కర్స్‌గా విధులు నిర్వహిస్తున్న 258 మందికి, హాస్టల్ వర్కర్లుగా పనిచేస్తున్న 100 మందికి వేతనాలు పెంచుతూ వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వీసీ ఆచార్య కె.గంగాధరరావు నియమించిన వేజెస్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు వేతనాలు పెంచారు. ఇందులో డెయిలీ వేజ్ కేటగిరీలో స్కిల్డ్ వర్కర్లకు రోజుకు రూ.825 నుంచి రూ.1,010 వరకు, సెమీ స్కిల్డ్‌కు రూ.715–930, అన్–స్కిల్డ్ రూ.600–790 పెంచారు. అలాగే హాస్టల్ వర్కర్లకు కేటగిరీ–1కు రూ.710 నుంచి రూ.840 వరకు, కేటగిరీ–2 రూ.670 నుంచి రూ.790 వరకు, కేటగిరి–3కు రూ.625 నుంచి రూ.740 వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. పెంచిన వేతనాలు ఆగస్టు 26వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

ఐసెట్ అడ్మిషన్ల ప్రక్రియ గడువు పొడిగించాలి

అఖిల భారత విద్యార్థి సమాఖ్య

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఏఐఎస్ఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో ఏఎన్‌యూలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు పాలెం నాసరయ్య, జిల్లా కార్యదర్శి యశ్వంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని విశ్వవిద్యాలయాల్లో ఐసెట్ అడ్మిషన్ల తేదీలు పొడిగించాలని డిమాండ్ చేశారు. సెలవు దినాల్లో అడ్మిషన్ల ప్రక్రియ మొదలు కావడంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని, అప్పటికే అడ్మిషన్ పొందిన కళాశాలలో ఉన్నటువంటి సర్టిఫికెట్లు చాలామంది పొందక సీటు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జాన్ సైదా, గణేష్, చందు, అఖిల్, వెంకీ నాయక్ గుంటూరు నగర కార్యదర్శి ప్రణీత్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

